

కుంకీ ఏనుగులు తెచ్చా!



అమరనాథ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

రాజకీయ ఉద్దండుల కుటుంబానికి వారసుడే అయినా.. ఆయన తొలి మెట్టు నుంచే నిచ్చెన ఎక్కారు. రాజకీయం వారసత్వమే అయినా, ప్రయాణం మాత్రం ఆయన సొంత శ్రమే!ఎమ్మెల్యేగా నాలుగోసారి గెలిచిన ఎన్. అమరనాథరెడ్డి తెలుగుదేశం పార్టీలోని సీనియర్ శాసనసభ్యుల్లో ఒకరు. ఈయన తండ్రి ఎన్. రామకృష్ణారెడ్డి మూడుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు.సర్పంచిగా, డీసీసీబీ ఛైర్మన్‌గా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి.. ఆ తర్వాతే అమరనాథరెడ్డి ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగు పెట్టారు. . 2014-19నడుమ టీడీపీ హయాంలో భారీ పరిశ్రమల మంత్రిగా చేసి ఉమ్మడి జిల్లాకు పెద్దఎత్తున పెట్టుబడుల్ని తెచ్చి తన ముద్ర వేశారు.పలమనేరు నుంచి శాసనసభకు రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న అమరనాథరెడ్డి తొలి ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులూ, రెండో ఏడాదికి పెట్టుకున్న లక్ష్యాలూ, ప్రజలు ఆయన నుంచి ఆశిస్తున్న పనుల సమాహారం...

- 6వ పేజీలో

కొనసాగిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. వాస్తవానికి ఈ ప్రక్రియ గత శుక్రవారానికి ముగిసిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో గైర్హాజరైన వారితో పాటు అనర్హులుగా పలువురు తేలడంతో తదుపరి మెరిట్ సాధించిన వారికి రాష్ట్ర విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఈ క్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 45 మంది అభ్యర్థులకు విద్యాశాఖ సోమవారం కాల్‌లెటర్లు పంపింది. దీంతో మంగళవారం స్థానిక అపోలో యూనివర్సిటీలో డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది. 45 మందిలో 37 మంది హాజరవగా, 8 మంది గైర్హాజరయ్యారు. 37 మందిలో 23 మంది దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు కావడంతో తదుపరి వైద్యపరీక్షల నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. వైద్య పరీక్షల నివేదికలను రాష్ట్ర విద్యాశాఖకు పంపనున్నారు. గైర్హాజరైన అభ్యర్థులకు బుధవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షల తేదీల్లో మార్పు

చిత్తూరుఅర్బన్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ఈనెల ఏడో తేదీవరకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఈ తేదీల్లో మార్పులు జరిగాయని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. ఈనెల ఐదో తేదీన సివిల్, ఏపీఎస్పీ పురుష అభ్యర్థుల (రిజిస్ట్రేషన్ నెంబరు 4094065 నుంచి 4174863 వరకు)కు జరగాల్సిన వైద్యపరీక్షలు ఈనెల 8 తేదీన నిర్వహించనున్నారు. అలాగే 7న జరగాల్సిన వారికి (రిజిస్ట్రేషన్ 4254681 నుంచి 4344024 వరకు) 9వ తేదీన, రిజిస్ట్రేషన్ నెంబరు 4347758 నుంచి 4504895 వరకు ఉన్న అభ్యర్థులకు పదో తేదీన చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని ఎస్పీ సూచించారు.

తుది దశకు మామిడి రైతుల సబ్సిడీ నమోదు ప్రక్రియ


సబ్సిడీ వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయంలో చేపట్టిన మామిడి రైతులకు సంబంధించిన సబ్సిడీ మొత్తాల నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మార్కెటింగ్, హార్టికల్చర్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మ్యాంగో పల్ప్ ఇండస్ట్రీస్, ర్యాంపుల్లో జిల్లాలోని 32,355 మంది రైతుల నుంచి 1,47,230 మెట్రిక్ టన్నుల మామిడి కాయలను కొనుగోలు చేశారు. మామిడి రైతులను ఆదుకోవడానికి కిలోకు రూ.12 గిట్టుబాటు ధరగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద రూ.4లను చెల్లించనుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తవగానే వివరాలను కలెక్టర్‌కు సమర్పిస్తామని మార్కెటింగ్, హార్టికల్చర్ శాఖల ఏడీలు పరమేశ్వరన్, కోటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు.

అవినీతి సీఐలకు అందలం



- చిత్తూరులో ఓ సీఐపై వరుస ఆరోపణలు
- ఆధారాలతో దొరికినా చర్యలు శూన్యం
- గతంలో ఇక్కడే చేసిన అవినీతి సీఐకీ కీలక పోస్టింగ్

చిత్తూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎస్ఐలు, సీఐల మీద తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చి విచారణలో అవి నిరూపణ అయితే, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.కానీ చిత్తూరు పోలీసు శాఖలో పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. చిత్తూరు నగరంలోని ఓ కీలక స్టేషన్ సీఐ మీద తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. గుట్కా వ్యాపారి నుంచి పెద్ద మొత్తంలో లంచం తీసుకున్నారనేది ఒకటి. గర్భిణులకు లింగ నిర్ధారణ చేస్తున్నవారిని స్వయంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ రైడ్ చేసి పట్టుకున్న నిందితుల నుంచి ఏకంగా రూ.15 లక్షలు తీసుకున్నారనేది మరోటి. ఈ రెండింటిలో గుట్కా వ్యాపారి నుంచి పెద్దమొత్తంలో లంచం వసూలు కేసును పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ విచారిస్తున్నారు. వసూలు చేసింది వాస్తవమే అనేది ప్రాథమిక సమాచారం. అయినా విచారణను రెండు నెలలుగా నానుస్తున్నారు. లింగ నిర్ధారణ చేసినవారి నుంచి డబ్బులు వసూలు చేసిన విషయం కూడా వాస్తవమే అయినప్పటికీ విచారణకు ఇంకా ఆదేశించలేదు. నెల రోజుల కిందటే కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ కేసు విషయంగా అప్‌డేట్స్ కనుక్కున్నట్లు సమాచారం.

● అవినీతిని తట్టుకోలేక పంపేసిన నగరి ఎమ్మెల్యే

గతంలో నగరి నియోజకవర్గంలో ఈ సీఐ పనిచేస్తుండగా.. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని చిత్తూరు తీసుకొచ్చి లూప్‌లైన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికే చిత్తూరులో కీలక స్టేషన్‌ను అప్పగించారు.దీనిపై అటు పోలీసు శాఖలో, ఇటు రాజకీయవర్గాల్లో తీవ్ర విమర్శలు వచ్చాయి.

● పాత సీఐపై చర్యలేవీ?

అలాగే, ఇదే స్టేషన్‌లో ఇతడి కంటే ముందు పనిచేసిన ఓ సీఐ మీద కూడా తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. బంగారు నగల దొంగ వద్ద సుమారు రూ.12 లక్షలు, రెండు ఆభరణాలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణల గురించి తెలిసిందే. ఆ దొంగ రాయచోటి క్రైమ్ పోలీసులకు దొరికిపోయి విషయం మొత్తాన్ని చెప్పేశాడు. అప్పటికే ఆ సీఐ.. 15 ఏళ్ల కిందట ఎస్ఐగా ఉన్నప్పుడు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అటవీశాఖ అధికారులకు దొరికిపోయారు. కేసు నమోదవ్వగా, సస్పెండ్ కూడా అయ్యారు. కెరీర్ మొత్తంలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడి మీద సాక్ష్యాలు దొరికినా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు.మూడు నెలల పాటు వీఆర్‌లో పెట్టి, ఆ మధ్య పుంగనూరు నియోజకవర్గంలో ఓ కీలక సర్కిల్‌కు సీఐగా నియమించారు. దీంతో అవినీతి అధికారులను అందలం ఎక్కిస్తున్నారని పోలీసు శాఖలోనే తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ ఇద్దరు సీఐలూ ఉన్నతాధికారికి ప్రియ శిష్యులు కావడంతోనే చర్యలు తీసుకోవట్లేదని పోలీసు వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.




దాసార్లపల్లె చెరువుకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ


పెద్దబరిణేపల్లె వీరన్న చెరువుకు జలకళ

పలమనేరులో యూరియా పాట్లు


పలమనేరు మార్కెట్ యార్డులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

పలమనేరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు లో బుధవారం మార్కెట్‌యార్డు వద్ద యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. వరినాట్లు వేసిన రైతులు యూరియాకోసం కొద్దిరోజులుగా ఎదురుచూస్తున్నారు. బుధవారం యూరియా వచ్చిందని తెలియడంతో ఒక్కసారిగా రైతులు మార్కెట్ యార్డుకు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు.మండలంలో 9 రైతు భరోసా కేంద్రాలకు 450 బస్తాల యూరియా చొప్పున పంపడం జరిగిందన్నారు.దుకాణాల ద్వారా యూరియా విక్రయించేందుకు 620 మెట్రిక్ టన్నులు తెప్పించినట్లు తెలిపారు.

ఆగి..సాగిన కృష్ణా జలాలు

ఆదినేపల్లె పంప్ హౌస్‌లో షార్ట్ సర్క్యూట్

ఆగిన పంపింగ్‌తో చెరువులకు నీటి మళ్లింపు

వి.కోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వి.కోట మండలం ఆదినేపల్లె పంప్ హౌస్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా కృష్ణా జలాల పంపింగ్ ఆగింది. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ చివరి లిఫ్ట్ హౌస్‌లో ఎలుకల కారణంగా ప్యానెల్ బోర్డులో వైర్లు సోమవారం ఉదయం 11గంటల ప్రాంతంలో కాలిపోవడంతో మోటార్లకు విద్యుత్ సరఫరా ఆగింది. గమనించిన హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు సరిచేసేందుకు ప్రయత్నించారు.అయితే వాటికి సంబంధించిన పరికరాలు లభ్యం కాకపోవడంతో కాలువలో 24గంటల పాటు నీటిని పంపింగ్ చేయలేక నీటి మట్టం పెరిగింది. దీంతో అధికారులు కాలువకు ఎగువనున్న పెద్దబరిణేపల్లె వెంగన్న చెరువు, దాసార్లపల్లె, ముదిమడుగు, పత్రపల్లె, పైపల్లె రాయప్ప చెరువుల వద్ద అమర్చిన తూములను కాస్త ఎత్తి చెరువులకు నీటిని విడుదల చేశారు. దీంతో దాసార్లపల్లె చెరువు 60 శాతం నీటితో కళకళలాడుతోంది. మంగళవారం ఉదయం 11 గంటలకు కాలిన పరికరాల స్థానంలో కొత్తవి అమర్చి తిరిగి పంపింగ్ మొదలు పెట్టారు.అయితే వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో హంద్రీనీవా కాలువలో మూడు రోజులకే నీళ్ళు ఆవిరయ్యాయంటూ ప్రచారం చేశారు. దీన్ని గమనించిన టీడీపీ నేతలు జరిగిన వాస్తవాలను తెలుపుతూ టీడీపీ గ్రూపుల్లో పోస్టు చేశారు.ఆదినేపల్లె లిఫ్టులో షార్ట్ సర్క్యూట్ జరిగి మరమ్మత్తులు జరుగుతున్నాయని, వైసీపీ విష ప్రచారం నమ్మొద్దంటూ ఆ పోస్టుల సారాంశం. మంగళవారం తిరిగి ఆదినేపల్లె లిఫ్ట్ హౌస్‌లో యధావిధిగా మోటార్లు పనిచేయడంతో కుప్పం వైపు గంగమ్మ పరవళ్ళు తొక్కింది. మంగళవారం నెర్నపల్లె పంచాయతీకి చెందిన అన్ని గ్రామాల ప్రజలు మిట్టూరు చెరువు వద్దకు చేరుకుని కృష్ణమ్మకు జలహారతులు ఇచ్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.


మిట్టూరు చెరువు వద్ద కృష్ణా జలాలకు హారతులు ఇస్తున్న నెర్నపల్లెవాసులు

గజ వాహనంపై గజముఖుడి విహారం

శ్రీశైల మల్లన్న గుడి తరపున పట్టు వస్త్రాల సమర్పణ


గజ వాహన సేవలో భక్తజనం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం గజవాహనంపై వినాయక స్వామి భక్తులకు దర్శమిచ్చారు.ఉభయదారులైన కాణిపాకానికి చెందిన వన్నియ నాయకర్ వంశస్థులు ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు.రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేసి,భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.గజ వాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ కాణిపాకం పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు.కాగా మంగళవారం శ్రీశైల మల్లన్న ఆలయ ఈవో శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలను తీసుకొచ్చి వరసిద్ధుడి ఆలయ అర్చకులకు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో ఈవో పెంచల కిషోర్, ఏఈవోలు రవీంద్ర బాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండ పాణి, శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు,బాలాజీనాయుడు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీశైల మల్లన్న ఆలయ అధికారులు

14న జాతీయ మహిళా సాధికారత బృందం చంద్రగిరి కోట సందర్శన



చంద్రగిరి కోటను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 14, 15 తేదీల్లో మహిళా సాధికారత కమిటీ సభ్యుల జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. సమావేశానికి లోకసభ స్పీకర్‌తో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు, మహిళా సాధికారత కమిటీ సభ్యులు, పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ సభ్యులు, రాష్ట్ర గవర్నర్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈసందర్భంగా వారు చారిత్రాత్మక ప్రాశస్త్యత కలిగిన 14న సందర్శించనున్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందుకూ కోట వేదిక కానుంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీలు రాజ్‌కుమార్, ఈశ్వర్‌రావులతో కూడిన బృందం, జిల్లా అధికారులు కలిసి మంగళవారం చంద్రగిరి కోటను సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆర్డీవో రామ్మోహన్, ఏపీ టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, డీటీ దివాకర్, కోట సీఏ బాలకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవంబరు వరకూ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దీపావళి, దసరా సందర్భంగా కొన్ని మార్గాల్లో నడుస్తున్న వారాంతపు ప్రత్యేక రైళ్లను అక్టోబరు నుంచి నవంబరు వరకు పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిరిడీ, నరసాపురం నుంచి తిరువణ్ణామలైల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు అక్టోబరు 5 నుంచి నవంబరు 24 వరకు నడుస్తాయి. తిరుపతి నుంచి షిరిడీకి ప్రత్యేక రైలు(07637), షిరిడీ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు(07638) నవంబరు 24 వరకు రాకపోకలు సాగిస్తాయి. నరసాపురం- తిరువణ్ణామలై (07219-07220), హైదరాబాదు- కన్యాకుమారి(07230-07229), కాచిగూడ-మదురై (07191-07192), హైదరాబాదు- కొల్లాం ప్రత్యేక రైళ్లు (07193-07194) రేణిగుంట, తిరుపతిల మీదుగా నవంబరు నెలాఖరు వరకు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 11 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.03 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,384
తలనీలాలు సమర్పించినవారు: 22,512



బైరెడ్డిపల్లె మండలం: మరమ్మతు చేయకముందు లక్కనపల్లె - బురిశెట్టిపల్లె రోడ్డు



చేసిన తర్వాత



అమరనాథ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

రాజకీయాల్లోనూ, పరిపాలనలోనూ సుదీర్ఘకాలపు అనుభవం ఉన్న నాయకుడు ఎన్.అమరనాథరెడ్డి. టీడీపీ అధికారం కోల్పోయిన ఐదేళ్లూ ఆయన నియోజకవర్గంలోనే కాదు జిల్లాలోనే వైసీపీకి ఎదురొడ్డి నిలిచారు. యువనేత లోకేశ్ పాదయాత్ర బాధ్యతను భుజాలకెత్తుకుని రాయలసీమలో విజయవంతం చేశారు. మంత్రిగా ఉన్న కాలంలో పలమనేరు అభివృద్ధికి ఆయన కన్నకలలన్నింటినీ వైసీపీ భగ్నం చేసింది. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో మొదలు పెట్టిన అభివృద్ధి పనుల్ని నిలిపేశారు. 2024లో పలమనేరు ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన అమరనాథ రెడ్డి..ఆగిపోయిన దగ్గర నుంచే అభివృద్ధిని నడిపిస్తున్నారు. అప్పటి పనుల్లో కొన్నింటికి రూ.200 కోట్లు ఇప్పటికే మంజూరు చేయించుకున్నారు. చేసిన పనులూ, చేస్తున్న పనులూ, చేయాల్సిన వాటి గురించి ఆంధ్రజ్యోతితో అమరనాథరెడ్డి పంచుకున్న సంగతుల్లోంచి ముఖ్యాంశాలు...

- కథనం, ఇంటర్వ్యూ : చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- పాత పనుల్ని పునరుద్ధరిస్తున్నా
- ఇప్పటికే రూ.200 కోట్ల పనులు మంజూరు
- ఇంకా రూ.400 కోట్ల పనులు చేయాలి

1 ఏడాదిలో ఏం చేశారు?

కుంకీ ఏనుగులు.. నా ఆలోచనే!

"ఏనుగుల దాడుల నుంచి పంటల్ని, రైతుల ప్రాణాల్ని రక్షించేందుకు కుంకీ ఏనుగుల్ని తెద్దామనే ఆలోచన కలిగింది.ఇందుకు పెద్దమొత్తంలో ఖర్చవుతుంది.నిధులు తేవడం అంత తేలిక కాదు. అయితే ఎక్స్‌ప్రెస్ వే ద్వారా అటవీశాఖకు అందిన రూ.17 కోట్ల పరిహారాన్ని దీని కోసమే ఖర్చు చేయాలని ఆ శాఖ అధికారులకు సూచించా. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన రోజే ఈ ఫైల్‌ను సీఎం, డిప్యూటీ సీఎంలకు అందించా. అసెంబ్లీలోనూ మాట్లాడా. దీంతో ఈ ప్రాజెక్టు త్వరగా సాకారమైంది. జిల్లాకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చి, ఆపరేషన్ కూడా మొదలుపెట్టాయి. నాకు జీవితంలో పెద్ద సంతృప్తి నిచ్చే అంశం ఈ కుంకీ ఏనుగుల్ని తేవడం."

ఆగిన చోట నుంచే అభివృద్ధి

"మంత్రిగా గతంలో సుమారు రూ.600 కోట్ల అభివృద్ధి పనుల్ని మంజూరు చేయించా. కొన్నింటికి శిలాఫలకాలు వేయగా, మరికొన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఆ పనులన్నీ రద్దు చేశారు. ప్రస్తుతం ఆ పనుల్ని రీ శాంక్షన్ చేసుకుంటే చాలు. ఎన్నికల్లో కూడా 'ఆగిన చోట నుంచే అభివృద్ధి' అని ప్రచారం చేశాం. రీ శాంక్షన్‌లో భాగంగా ఇప్పటికే రూ.137 కోట్లతో 117 రోడ్ల పనుల్ని పూర్తి చేశాం. త్వరలో వాటన్నింటినీ ప్రారంభిస్తా."

- పలమనేరు పట్టణంలో సిప్ ప్రోగ్రామ్ కింద రూ.50 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నాం. దీని కోసం మంత్రి నారాయణ వెంట పడుతున్నా.

క్యాంపులోని కుంకీ ఏనుగులు



మళ్లీ పనుల పరుగులు

ప్రోగ్రెస్ రిపోర్ట్

తొలి ఏడాది జరిగిన అభివృద్ధి

- 27 పాఠశాలల్లో రూ.3.28కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.31.07 కోట్లతో 314 సీసీ రోడ్ల నిర్మాణం
- వివిధ శాఖలనుంచి రూ.25 కోట్ల నిధులతో 11 బీటీ రోడ్ల నిర్మాణం
- రూ.1.45కోట్లతో 9 ఎస్సీ, బీసీ హాస్టళ్లకు మరమ్మతులు
- రూ.137.50 కోట్లతో 117 ఈఏపీ (ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు) రోడ్ల నిర్మాణం
- రూ.15 కోట్లతో పలమనేరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 27 భవనాల నిర్మాణం
- పలమనేరు మున్సిపాలిటీలో మౌలిక వసతుల కోసం రూ.11 కోట్లు వ్యయం, రూ.11 కోట్లతో కోర్టు భవన నిర్మాణం, రూ.1.80 కోట్లతో ఆడిటోరియం.
- 48అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.18 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం.
- పలమనేరు డిపోలో 16 కొత్త బస్సు సర్వీసుల ప్రారంభం.
- నియోజకవర్గంలో తాగునీటికి రూ.5.12 కోట్ల ఖర్చు.
- 12,530మందికి పొసెషన్ సర్టిఫికెట్ల పంపిణీ.

మలి ఏడాది లక్ష్యాలు

- బైరెడ్డిపల్లెలోని కైగల్ రిజర్వాయర్‌ను రూ.20 కోట్లతో, గంగన్న శిరస్సును రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడం
- రూ.15 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ గర్ల్స్ కాలేజీ, రూ.17 కోట్లతో బీసీ రెసిడెన్షియల్ గర్ల్స్ జూనియర్ కాలేజీ, రూ.14 కోట్లతో వి.కోటలో డిగ్రీ కాలేజీల ఏర్పాటు
- రూ.15.83 కోట్లతో కౌండిన్య నది పొడవునా 15 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
- రూ.5 కోట్లతో వి.కోటలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు
- పలమనేరులోని ప్రభుత్వ ఉమెన్స్ పాలిటెక్నిక్‌లో రూ.8 కోట్లతో భవనాల నిర్మాణం.
- రూ.1.11 కోట్లతో వి.కోటలో అంబేడ్కర్ భవన నిర్మాణం
- పలమనేరు మార్కెట్ యార్డును 33 ఎకరాల్లో మోడల్‌గా నిర్మించడం
- పలమనేరు పట్టణ సుందరీకరణతో పాటు కొత్త డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం.

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే సమాధానాలు



? ఎమ్మెల్యే గారూ బైరెడ్డిపల్లె మండలం కైగల్ నుంచి శనిపల్లె మీదుగా రామసముద్రం గ్రామానికి వెళ్లేందుకు తారురోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గుంతలమయమైన ఈ దారిలో ప్రయాణం నరకంగా ఉంది. ఈ పనుల్ని పూర్తి చేస్తామని మీరు హామీ ఇవ్వడంతో ఆశగా ఎదురు చూస్తున్నాం.

- జయరామ్, ఎం.కొత్తూరు, బైరెడ్డిపల్లె

! గత ప్రభుత్వం కావాలనే ఈ పనులు ఆపేసింది. అప్పటి వైసీపీ నాయకులు రోడ్డు మీద తోలిన మెటల్ కూడా అమ్ముకున్నారు. రీ శాంక్షన్ సమయంలో టెక్నికల్ ఇబ్బందులు ఎదురు కావడంతో ఈ ఏడాది పనుల్ని చేయలేకపోయాం.త్వరలో పనుల్ని ప్రారంభిస్తాం. - ఎమ్మెల్యే



? వి.కోట మండల కేంద్రంలో పదేళ్ల కిందట మొదలు పెట్టిన షాదీమహల్ పనులు పునాదులు దాటలేదు. ఇప్పుడైనా మొదలు పెట్టండి ఎమ్మెల్యేగారూ.

- రూహుల్లా, ఖాజీపేట, వి.కోట మండలం

! కూటమి ప్రభుత్వం వచ్చాక వి.కోటతో పాటు పలమనేరులోనూ షాదీమహళ్లను తిరిగి మంజూరు చేసుకున్నా. నిధుల మంజూరు, సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోంది. ఖచ్చితంగా ఈ పనుల్ని ప్రారంభిస్తాం. - ఎమ్మెల్యే


కుంకీ ఏనుగుల క్యాంపు



? పలమనేరులో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం కళామందిరం నిర్మిస్తే చాలా ఉపయోగపడుతుంది సార్.

- పి.తులసినాథం నాయుడు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు

! ఇది కూడా 2019లో మంజూరు అయిన పనే. వైసీపీ వచ్చాక రద్దు చేసింది. ప్రస్తుతం రీ శాంక్షన్ చేసి టెండర్ పిలిచాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం. - ఎమ్మెల్యే



? 2019లో మంత్రిగా మీరు రాయలపేట- మాధవరం రోడ్డు అభివృద్ధికి శిలాఫలకం వేశారు.ఎన్నికల సమయంలోనూ హామీ ఇచ్చారు. మళ్లీ ఈ రోడ్డు వేసే అవకాశం ఉందా ఎమ్మెల్యేగారూ.

- చంద్రశేఖర్, రైతు, మద్దలకుంట, పెద్దపంజాణి మండలం

! 2019లో మంజూరు చేయించి, అన్నిరకాల క్లియరెన్సులు తెచ్చాక ప్రభుత్వం మారిపోయింది. రాయలపేట ఊర్లో రోడ్డు, రాయలపేట నుంచి మాధవరం రోడ్డు.. ఈ రెండూ చేపట్టనున్నాం. టెండరు దశలో ఉన్నాయి. కానీ, రాయలపేట - మాధవరం రోడ్డులో 3 కిలోమీటర్లు ఫారెస్టు క్లియరెన్సు తెచ్చుకోవాలి. అది ఆలస్యమవుతుంది. - ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె మండలం: మరమ్మతు చేయకముందు కంకర రోడ్డుగా ఏటిగడ్డిండ్లు- గాజీపేట మార్గం





అభివృద్ధి చేశాక..

ఘనంగా ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవం


టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ) లక్ష్యాలను నెరవేర్చడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలోని గాంధీ, అంబేడ్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, ఆచార్య గోవిందరాజులు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన సభలో వీసీ అప్పారావు మాట్లాడుతూ.. వరల్డ్, ఆసియా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే ఎస్వీయూకు మొదటి స్థానం లభించిందన్నారు. క్వాంటం టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ సాథయిలో గొప్ప గుర్తింపును సంతరించుకుందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారాన్ని అందిస్తూ ఉందన్నారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మిమిక్రీ విజయకుమార్ ప్రదర్శన అలరించింది. ఓ ఉద్యోగి అన్నమయ్య వేషధారణతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికితోడు మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలిపిన వివరాల మేరకు.. కట్టమంచి హరిజనవాడకు చెందిన మోహన్(43) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మరోవైపు భార్య కూడా ఘర్షణపడి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ బాధలో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం కట్టమంచి కొత్తబ్రిడ్జి వద్ద ఉన్న వ్యవసాయపొలాల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైసీపీలో ఆధిపత్య పోరు!

స్వామి వర్గీయులను పట్టించుకోని కృపాలక్ష్మి

పెనుమూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):పెనుమూరు వైసీపీలో ఆధిపత్య పోరు మరోసారి మొదలైంది. మంగళవారం జరిగిన వైఎస్ వర్ధంతి వేడుకల్లో ఇది బయటపడింది. నారాయణస్వామి డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు నాయకులతో ఆయనకు విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో అన్ని మండలాల్లో తన వర్గాన్ని తయారు చేసుకుని, వారికే పదవులు కట్టబెట్టారు. ఈ క్రమంలో స్వామికి టికెట్ ఇవ్వకూడదని ఆయన వ్యతిరేక వర్గం బహిరంగ ప్రకటనలు కూడా చేసింది. దీనికి తగ్గట్లే తొలుత స్వామికే టికెట్ ఇచ్చి, ఆ తర్వాత ఆయన కుమార్తె కృపాలక్ష్మికి మార్చారు. ఈమె డాక్టర్ థామస్ చేతిలో 26వేల పైచిలుకు ఓట్లతో ఓటమి పాలయ్యింది. దీనికి తమ పార్టీలోని కొందరు రెడ్లే కారణమని వైసీపీ శ్రేణులు చెప్పుకొచ్చాయి. ఇప్పుడు మళ్లీ అదే తీరు మొదలయ్యిందనే చెప్పాలి. మంగళవారం పెనుమూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి, అన్నదానం చేయాలని ప్రభుత్వ మాజీ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి వర్గం నిర్ణయించుకుంది. స్వామి అనుచరులుగా ముద్రపడ్డ వైసీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూదిమోహన్, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి వర్గీయులు పాకాల రోడ్డులోని మరో వైఎస్ విగ్రహానికి పూలమాల వేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పెనుమూరుకు వచ్చిన కృపాలక్ష్మి నేరుగా జ్ఞానేంద్రరెడ్డి, ఎంపీపీ హేమలతరెడ్డితో కలిసి తహసీల్దారు కార్యాలయం ముందున్న విగ్రహానికి పూలమాల వేసి వెళ్లిపోయారు. దీనిపై స్వామి వర్గీయులు చేసేదేమీ లేక వారే పూలమాల వేసి వెళ్లిపోయారు. నారాయణస్వామి వెంట నడిచి ఎన్నో ఇబ్బందులు పడ్డ తమను కృపాలక్ష్మి పట్టించుకోకపోవడం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

'అంబులెన్స్'ను అత్యవసర వైద్యసేవలకే వినియోగించాలి: కలెక్టర్


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, మేయర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ వాహనాలను అత్యవసర వైద్యసేవలకే వినియోగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కొత్త అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి పాతబడిన అంబులెన్స్ స్థానంలో కొత్త వాహనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐఓసీఎల్ త్వరలో మరో వాహనాన్ని అందించనుందని చెప్పారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏడీకి మార్కెట్ కమిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్‌శాఖ ఏడీ పరమేశ్వరన్.. మార్కెట్ కమిటీ కార్యదర్శిగా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శి ఇందుమతి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో పరమేశ్వరన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కడప ఆర్జేడీ రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

యాదమరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దాసరాపల్లె పంచాయతీ పరిధిలో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వో సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిపాల తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా రెడ్డెప్ప



గుడిపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుడిపాల తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా ఏఎల్‌పురానికి చెందిన రెడ్డెప్పను ఎన్నుకున్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకీ పదవి ఇచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రిలో ఉన్న దివ్యాంగురాలికి పింఛను నగదు అందజేత



వెదురుకుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇనాంకొత్తూరు గ్రామ పంచాయతీ అయ్యన్నగారిపల్లెకు చెందిన దివ్యాంగురాలైన పుల్లూరు మునిలక్ష్మి ఇంటి వద్ద కాలుజారిపడి గాయపడ్డారు. దీంతో ఆమెకు తిరుపతి బర్డ్‌లో చికిత్స చేస్తున్నారు. ఈమెకు మంజూరైన పింఛను నగదు రూ.6వేలను కొమరగుంట గ్రామ సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్ రజిత మంగళవారం ఆస్పత్రికెళ్లి అందజేశారు.

విద్యార్థులకు స్టీల్ గ్లాసుల పంపిణీ

పాలసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు మంగళవారం మహిళా కానిస్టేబుల్ భారతి స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. రాగిజావ తాగడానికి ఈ గ్లాసులు అనుకూలంగా ఉంటాయని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు.

నైపుణ్యాలతోనే యువతకు ఉపాధి

జాబ్‌మేళాలో ఎమ్మెల్యే జగన్మోహన్



జాబ్‌మేళా వేదికపై ఎమ్మెల్యే గురజాల, ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తదితరులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలతోనే యువతకు ఉపాధి లభిస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. చిత్తూరు యువత ఉపాధి కోసం ఇతర నగరాలకు వలస వెళ్లే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టామన్నారు. జాబ్‌మేళాలో విప్రో, 24/7, టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ వంటి 13 సంస్థలు పాల్గొన్నాయి. 347 మంది యువతీ యువకులు హాజరవగా, 162 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన జరిగిన జాబ్‌మేళాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి, కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ ఎన్‌వీఎస్ నారాయణరావు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీవ థియోలాజికల్ ఓపెన్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా బాబు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై జీవ థియోలాజికల్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా చిత్తూరుకు చెందిన డాక్టర్ కె.బాబు అలియాస్ రూపేష్‌బాబును నియమిస్తూ వీసీ ఝాన్సీరాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పరిశ్రమల అభివృద్ధి సాధికారిక సంస్థ (అపిట్‌కో) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రూపేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టరైన బాబు సేవలను తాము వినియోగించుకోవాలని భావించిన ఆ వర్సిటీ పాలక కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ (కరాటే) శిక్షణలో ప్రభుత్వం ఆయన సేవలు వినియోగించుకున్న విషయం తెలిసిందే. బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు కృషి చేసి, వర్సిటీకి మరింత గుర్తింపు తీసుకురానున్నట్లు తెలిపారు. తనికీ అవకాశం కల్పించిన వీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంసీ ఆస్పత్రి వద్ద భూ తగాదా



చికిత్స పొందుతున్న కన్నమ్మ

గుడిపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని 190 రామాపురం సీఎంసీ ఆస్పత్రి వద్ద భూ తగాదా జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సర్వే నెంబరు 35-ఎ3లో 190 రామాపురం దళితవాడకు చెందిన కన్నమ్మకు సీఎంసీ ఆస్పత్రి లోపల భూమి ఉందని చెబుతూ మంగళవారం చదును చేయడానికి వెళ్లారు. ఆస్పత్రి లోపలున్న భూములన్నీ సీఎంసీకి చెందినవని సెక్యూరిటీ సిబ్బంది చెప్పారు. అయితే ఆ భూమి తమదేనని కన్నమ్మ, ఆమె కుమారుడు తులసీరామ్ సెక్యూరిటీతో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో కన్నమ్మ కిందపడటంతో గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం

తమిళనాడు యువకుడి మృతి - మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మోహన్ మృతదేహం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో తమిళనాడుకు చెందిన యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలిపిన వివరాల మేరకు.. బుధవారం చిత్తూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలను కట్టడానికి తమిళనాడు నుంచి కొంత మంది కూలీలను చిత్తూరుకు చెందిన ఓ ఫ్లెక్సీ యజమాని తీసుకొచ్చాడు. మంగళవారం ఎస్బీఐ ఎదురుగా ఫ్లెక్సీని కడుతుండగా పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తూ చేతికి తగలడంతో మోహన్(19)తోపాటు మరో ఇద్దరు కూలీలు విద్యుదాఘాతంతో కిందపడ్డారు. ముగ్గురినీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోహన్ మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

● 5 నుంచి పవిత్రోత్సవాలు



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తదితరులు

తిరుచానూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 5 నుంచి పవిత్రోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించారు. ఆలయ గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఈ నెల 4న అంకురార్పణ.. 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల్లో ఉదయం బ్రేక్ దర్శనం, ఆర్జితసేవలు రద్దు చేశారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఓ దాత పరదాలను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

సర్వదర్శన క్యూలైన్ వద్ద నెమలి



తిరుమల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని సర్వదర్శన క్యూలైన్‌లో ఉన్న భక్తులను అడవిలోంచి వచ్చిన ఒక నెమలి అలరించింది. శేషాచలం అడవుల్లో నుంచి నెమళ్లు జనసంచారంలోకి రావడం అరుదు. మంగళవారం ఉదయం కృష్ణతేజ విశ్రాంతి భవనానికి సమపంలోని రింగురోడ్డులో సర్వదర్శన క్యూలైన్ల వద్దకు నెమలి వచ్చి చాలా సేపు తిరుగులాడింది. అక్కడి సిబ్బంది, వాహనాల్లోని వారూ దానిని తమ మొబైల్‌లో ఫొటోలు తీశారు.

పాడి రైతులకు విరివిగా రుణాలివ్వండి : కలెక్టర్



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పాడి లబ్ధిదారుల ఎంపికపై సమీక్షించారు. వివిధ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.7కోట్ల మేర పాడిరైతులకు రుణసౌకర్యం అందించినట్లు చెప్పారు. పాడిరంగంపై ఆసక్తి ఉన్న రైతుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఒకటి లేదా రెండు పాడిఆవులు కలిగిన రైతులను గుర్తించాలని సూచించారు. అసిస్టెంట్ ఎల్డీఎం తరుణ్‌కుమార్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, పశుసంవర్ధకశాఖ డాక్టర్లు పాల్గొన్నారు.

రథోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం స్వామికి రథోత్సవాన్ని(తేరు) నిర్వహించనున్నారు.ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.రథం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను సేఫ్టీ అధికారుల నుంచి తీసుకున్నారు.ఈవో పెంచల కిషోర్, ఈఈ వెంకటనారాయణ, ఎంపీడీవో ధనలక్ష్మి,ఎస్‌ఐ నరసింహులు తదితరులు కాణిపాకంలో రథం తిరిగే ప్రదేశాలను తనిఖీ చేశారు.రథోత్సవం సజావుగా నిర్వహించడానికి సహకరించాలని వ్యాపారులను కోరారు.రథాన్ని అలంకరించడానికి అవసరమైన వివిధ రకాల పుష్పాలను తెప్పించారు.



కాణిపాకం పురవీధులను పరిశీలిస్తున్న ఈవో పెంచలకిషోర్, అధికారులు - రథోత్సవానికి సిద్ధమైన స్వామి రథం

ఆమెది ఆత్మహత్య కాదు.. హత్యే..!

తల్లి ఫిర్యాదుతో 15 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన వైనం



మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

యాదమరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందని అందరూ భావించారు. అంతిమ సంస్కారాలూ పూర్తయ్యాయి. అయితే ఆమె తల్లి ఫిర్యాదుతో 15 రోజుల తర్వాత ఆత్మహత్య కాదు.. హత్యగా తేలింది. శ్రీరంగరాజపురం ఎస్‌ఐ సుమన్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీరంగరాజపురం మండలం పాతపాళ్యం గ్రామంలోని పూజ (30)కి యాదమరి మండలంలోని వరదరాజులపల్లె గ్రామానికి చెందిన శేఖర్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శేఖర్ మూడేళ్ల కిందట మరణించారు. ఈ క్రమంలో పాతపాళ్యానికి చెందిన భాస్కర్‌తో పూజ వివాహేతర సంబంధాన్ని కొనసాగించింది. గతనెల 17వ తేదీన పుట్టింట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి అనారోగ్యమే కారణమని అందరూ భావించారు. మృతదేహాన్ని వరదరాజులపల్లెకి తీసుకొచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అయితే మృతురాలి తల్లి రాధ మాత్రం తన కుమార్తె ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేసి గ్రామస్తులతో కలిసి శ్రీరంగరాజపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే కొట్టి చంపి, ఉరేసినట్లు ఒప్పుకున్నాడు. హత్య కేసుగా నమోదు చేసి.. మంగళవారం తహసీల్దార్ పార్థసారధి ఆధ్వర్యంలో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ సుమన్ పంచనామా చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లిదండ్రుల్లేని పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని పూజ తల్లి రాధ వేడుకున్నారు.

పంటలపై ఆగని గజదాడులు

● పలు గ్రామాల్లో పంటల ధ్వంసం



ధ్వంసమైన వరిపంట

కల్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు ఆగడంలేదు. పగలంతా అడవిలో సంచరిస్తున్న గజరాజులు రాత్రి సమయంలో పొలాల్లోకి చేరుకొని పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని పాతపేట, చల్లావారిపల్లి, మతుకువారిపల్లి పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక సమీపం నుంచి సోమవారం రాత్రి బయలుదేరిన 13 ఏనుగుల గుంపు కల్లూరు- గంటావారిపల్లి రోడ్డును దాటుకొని పాతపాళ్యం గుట్ట వద్దకు చేరుకున్నాయి. పాతపేటలోని సురేష్‌కు చెందిన కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇదే గ్రామంలోని సుబ్రహ్మణ్యం, మదన, కుప్పయ్యలకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. ప్రతాప్, వై.సుబ్రహ్మణ్యం, నాగరాజులకు చెందిన పశుగ్రాసం ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి పాతపేట వద్దకు ఏనుగులు చేరుకోవడంతో గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పాతపేట వద్దకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది టపాకాయలు పేల్చడంతో ఏనుగుల గుంపు చల్లావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. చల్లావారిపల్లిలోని దామోదర నాయుడు, సుబ్రహ్మణ్యం, మునికృష్ణకు చెందిన టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. అలాగే రామచంద్రకు చెందిన రాగి, వేరుశనగ పంటలను ధ్వంసం చేశాయి. మతుకువారిపల్లిలోనూ పంటలపై దాడులు చేశాయి. అనంతరం తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు గోగులమ్మ వంక సమీపంలోని అడవిలోకి చేరుకున్నాయి. మంగళవారం పగలంతా గోగులమ్మ వంక సమీపంలో తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

ముక్కంటి ఆలయం వద్ద భక్తుడికి గుండెపోటు

● అంబులెన్సు ఉన్నా అందుబాటులో లేని డ్రైవర్లు

● కుటుంబీకుల ఆర్తనాదాలు విని బాధితుడిని తీసుకెళ్లిన పోటు అర్చకుడు

● అప్పటికే మృతిచెందినట్లు వైద్యుల నిర్ధారణ



నరసింహారావు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్కంటి దర్శనార్థం విచ్చేసిన నరసింహారావు (60) గుండెపోటుతో మృతి చెందారు. కడపకు చెందిన ఈయన కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయం చేరుకున్నారు. అద్దె గది కోసం ఆలయ నాలుగో ప్రవేశ మార్గం వద్ద ఉన్న సీఆర్వో కేంద్రానికి కుటుంబ సభ్యులు వెళ్లారు. సీఆర్వో కార్యాలయం వెలుపల నిలబడి ఉన్న నరసింహరావు ఉన్నట్టుండి కుప్పకూలారు. అంబులెన్సు నిలిపి ఉంచే పరిపాలనా భవనానికి సమీపంలో భక్తుడు గుండెపోటుకు గురయ్యారు. ఆ సమయంలో ఒక్క డ్రైవరూ అందుబాటులో లేరు. మరోవైపు బాధితుడి కుటుంబీకులు ఆర్తనాదాలు పెట్టారు. ఆ సమయంలో ముక్కంటి ఆలయ నైవేద్యం తయారీ పోటులో పనిచేసే అర్చకుడు రాజీశర్మ అటుగా వెళుతూ స్పందించారు. నరసింహారావును ఆలయ అంబులెన్సులో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నరసింహారావు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంబులెన్సు డ్రైవర్లు అందుబాటులో లేకపోవడంపై మృతుడి బంధువులతో పాటు ఈ ఘటన చూసిన భక్తులంతా ఆవేదన చెందారు.

ఇదేమి తీరు?

ముక్కంటి ఆలయంలో మొత్తం ఏడుగురు డ్రైవర్లను నియమించారు. అంబులెన్సుతో పాటు అధికారుల వాహనాలకు వీరు విధులు నిర్వహించాలి. ఆలయం తరపున ఉన్న అంబులెన్సు కోసం షిఫ్టుల ప్రాతిపదికన నిరంతరం డ్రైవర్లు అందుబాటులో ఉండాలి. వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేస్తుంటారు. ముఖ్యంగా రాత్రివేళలో ఆలయ ప్రాంగణంలో ఆరుబయట భక్తులు పెద్దసంఖ్యలో నిద్రిస్తుంటారు. పలుమార్లు రాత్రి వేళల్లో ప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయి. నాల్గో గేటు వద్ద నిద్రిస్తున్న భక్తులపై స్టోర్ కోసం నిత్యావసరసరుకులు తీసుకువచ్చిన మినీలారీ మూడేళ్లక్రితం దూసుకెళ్లింది. రాత్రివేళల్లో స్వల్ప ఘటనలు జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన ఆలయ స్థావరంలో అంబులెన్సు డ్రైవర్ విధుల్లో అప్రమత్తంగా లేకపోవడం విమర్శలకు తావిచ్చింది.

బలాత్కారం కేసులో వైసీపీ కార్యకర్తకు రిమాండ్

పుంగనూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంట్లోకి చొరబడి మహిళను బలాత్కరించబోయిన వైసీపీ కార్యకర్తను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ ఎస్.వెంకటరమణ కథనం మేరకు ..పుంగనూరు బస్టాండు వద్ద కొత్తిమీర విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వనజ అనే మహిళ ఇంట్లోకి వైసీపీ కార్యకర్త అమ్ముకుట్టి అలియాస్ మహబూబ్‌బాషా(35) ఈ ఏడాది జూలై 21వతేది చొరబడి బలాత్కరించబోయాడు. ఆమె ప్రతిఘటించింది. అదే సమయంలో ఆమె మరిది వచ్చి విడిపించగా అమ్ముకుట్టి పరారయ్యాడు. భర్త అనారోగ్యంతో మృతి చెందగా ఇద్దరు పిల్లలతో వనజ నివసిస్తుండేది. ఈ విషయంపై కుటుంబంలో గొడవలు జరగడంతో ఆమె పిల్లలను తీసుకుని సత్యసాయిజిల్లా పుట్టపర్తిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. బలాత్కారం కేసులో నిందితుడై పరారీలో ఉన్న అమ్ముకుట్టిని అరెస్టు చేసి ఇన్‌చార్జి న్యాయమూర్తి సుభాన్ ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ ఎస్.వెంకటరమణ తెలిపారు. అతన్ని అన్నమయ్యజిల్లా మదనపల్లె సబ్‌జైలుకు తరలించినట్లు వివరించారు. నిందితుడిపై 8 కేసులున్నాయని, పుంగనూరు స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై వున్నట్లు చెప్పారు.

డ్వాక్రా యాప్ ద్వారా సమగ్ర సమాచారం

తిరుపతి రూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలకు సంబంధించి రుణాలు,చెల్లింపులు 'మనడబ్బులు-మనలెక్కలు' యాప్ ద్వారా తెలుసుకునే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని సెర్ప్ సీఈవో వాకాటి అరుణ తెలిపారు. తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా వెలుగు కార్యక్రమాల సమీక్షా సమావేశానికి ఆమె హాజరయ్యారు. అరుణ మాట్లాడుతూ ఏడాదిలో ప్రతి సభ్యురాలికి కావాల్సిన రుణాలు, వినియోగం తదితర వివరాలతో ముందస్తుగా తెలుసుకుని వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిసభ్యురాలిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, ఉన్నతి, బ్యాంకు రుణాలను మంజూరు చేయించడంతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరిచేలా శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటున్న రూ.3200కోట్ల మేర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, అడిషనల్ పీడీ ప్రభావతి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నిర్వహించే వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ కామర్స్, తెలుగు, మ్యూజిక్ కోర్సుల్లో ప్రవేశానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చివరి గడువు ఈ నెల 30వ తేదీగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో కానీ, 8121787415 నెంబరులో కానీ సంప్రదించవచ్చని వర్సిటీ పీఆర్వో డాక్టర్ ఎన్.శ్రీరజని తెలిపారు.

ఏడు రోజులపాటు శ్రీనివాస దివ్యానుగ్రహ పూజల టిక్కెట్ల నిలిపివేత

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్ర హోమ పూజల ఆన్‌లైన్ టిక్కెట్ల జారీని ఏడు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు టీటీడీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమ పూజలు నిర్వహించే ప్రాంతంలో అడ్డుగానున్న చెట్ల తొలగింపు, నవీకరణ తదితర కారణాల నేపథ్యంలో ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు ఈ టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉండవని చెప్పారు. హోమ పూజలు మాత్రం మరోచోట ఏకాంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయానికి భక్తులు సహకరించాలని కోరారు.

సజ్జల అవివేకానికి ఆ మాటలే రుజువు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రతిపక్ష హోదా లేదని తెలుసుకోలేని మూర్ఖుడు ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 17 ఎమ్మెల్యే సీట్లు వస్తేనే ప్రతిపక్ష హోదా ఇస్తారన్న విషయం తెలుసుకోకుండా సజ్జల మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని చెప్పారు. గతంలో ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖలు రాసినప్పటికీ.. ఇవ్వలేమని స్పీకర్ రాతపూర్వకంగా వైసీపీకి సమాధానం ఇచ్చారన్నారు. అయినప్పటికీ ప్రతిపక్ష హోదాపై సజ్జల మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ధైర్యముంటే శాసనసభకు వచ్చి ప్రశ్నించాలని మాజీ సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లయితే వెన్నుపోటు దినోత్సవంగా జరుపుకోవాలని సజ్జల వాగుతున్నారని అన్నారు. తనకు రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్ పార్టీని, సోనియా గాంధీని వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఎవరిదని ప్రశ్నించారు. నేతలు మోహన్ రాజ్, మేషాక్, కందస్వామి, వంశీ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి



చిత్తూరు లీగల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు కోర్టుల్లో ఈనెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, న్యాయమూర్తి భారతి పిలుపునిచ్చారు. మంగళవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రజలు క్షణికావేశానికి లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సమస్యలుంటే ఆవేశాలకు పోయి కేసులు పెట్టుకోకుండా రాజీ మార్గంలో వెళ్లాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతోపాటు పలురకాల కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 94,647 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు సహకరించాలని కోరారు.

పీఎం కుసుమ్ పథకంపై ఆరా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పీఎం కుసుమ్ పథకంపై ప్రాజెక్టు డైరెక్టర్ అయూబ్‌ఖాన్ ఆరా తీశారు. మంగళవారం తిరుపతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో 161 ఎకరాల స్థలం కేటాయించడానికి కలెక్టర్ అంగీకరించారన్నారు. ఇందులో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల మండలాల్లో 40 మెగావాట్ల సోలార్ యూనిట్ పెట్టనున్నామని వివరించారు. ఈ పనులు త్వరగా ప్రారంభించాలని అయూబ్‌ఖాన్ ఆదేశించారు.

ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు నిబంధనలు పాటించాలి: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసి సెంటర్లు నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో వివిధ ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఐవీఎఫ్, ఐసీఐఎస్ వంటి చికిత్సలు కేవలం నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే జరపాలన్నారు. ఎగ్స్, వీర్యం విక్రయాలు పూర్తిగా నిషేధమన్నారు. కేవలం సరోగసి(అద్దె గర్భం)కు మాత్రమే అనుమతి ఉందని, వాణిజ్య సరోగసికి అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలో తొమ్మిది ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయని ఆమె తెలిపారు. అనుమతి లేకుండా ఏఆర్‌టీ కేంద్రాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో అచ్చమైన ప్రజాపాలన



ఎన్.కొత్తపల్లెలో లబ్దిదారులతో ప్రేమ్‌కుమార్

కుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అచ్చమైన ప్రజా పాలన తీసుకొచ్చారని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లెలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా భక్షక పాలన పోయి ఇప్పుడు ప్రజా రక్షక పాలన వచ్చిందన్నారు. తన ఇంట్లోదేదో తెచ్చి ఇస్తున్నట్లు జగన్‌రెడ్డి రేషన్ కార్డుల్లో, భూముల పట్టాదారు పాసు పుస్తకాల్లో తన ఫొటోలు ముద్రించుకున్నారని ఎద్దేవా చేశారు. తద్వారా వందల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృథా చేశారని విమర్శించారు. ఆఖరుకు సర్వేరాళ్లకు కూడా తన ఫొటోలు వేయకుండా వదల్లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు తమ పార్టీ రంగులు వేయించడం, ఎక్కడపడితే అక్కడ అదే రంగులు పులమడం వంటి పిచ్చిపనులు చాలా చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చిట్టిబాబు, స్థానిక సర్పంచి రాజశేఖర్ కృష్ణయ్య, నాయకులు వెంకటేశ్, నాగరాజు, విజయ కుమార్, బాలకృష్ణ, కదిరప్ప, సంతూరు, మణి, హైదర్‌వలీ, వీఆర్వో, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు జలహారతి జ్ఞాపిక



సీఎంకు జ్ఞాపిక బహూకరిస్తున్న జగదీశ్‌బాబు

కుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాయి మాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు జలహారతి జ్ఞాపికను బహూకరించారు. శ్రీశైలం నుంచి 738 కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం చేరుకున్న కృష్ణమ్మకు కుప్పం మండలం పరమ సముద్రం చెరువు సమీపంలో ముఖ్యమంత్రి గతనెల 30వ తేదీన జలహారతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన్ను కలిసిన జగదీశ్‌బాబు ట్రస్టు తరఫున, కుప్పం నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ జ్ఞాపికను అందజేశారు. రాయలసీమను రతనాల సీమగా మార్చాలన్న తపనతో అపర భగీరథుడిలా పట్టువదలకుండా కృష్ణమ్మను రప్పించి నేలను సస్యశ్యామలం చేసిన ముఖ్యమంత్రికి ఈ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళలకు ప్రత్యేక గుర్తింపు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో నియోజకవర్గ స్థాయిలో స్త్రీ శక్తి పథకంపై ఈనెల 3న జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు స్త్రీశక్తి పథకంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు, పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు

సోమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప, కోశాధికారి జ్యోతీశ్వరుడు తెలిపారు. మంగళవారం బుంగావారిపల్లెకు చెందిన శెట్టివారి శివమూర్తి రూ.11,116, పత్రపల్లెకు చెందిన ముని ప్రసాద్ రూ. 10,116 అందజేశారు. ఈక్రమంలోనే నిర్మాణ పనులను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు



ఆలయ భూముల వేలం రద్దు చేయాలని వినతి చేస్తున్న గ్రామస్తులు

సోమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపంలోని పలు ఆలయ భూములు అన్యాక్రాంతం కావడంతో స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దఉప్పరపల్లె రామాలయంలో పుంగనూరు దేవాదాయశాఖ ఈవో కమలాకర్ ఆలయ భూములు లీజుకు వేలం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అధికారులు వేలం నిర్వహణకు ప్రయత్నించినా ప్రజలు అడ్డుకోవడంతో వేలం ఆపేశారు. ఆలయ భూములను సర్వే చేసిన తర్వాతనే వేలం నిర్వహించాలని ఆలయ అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరి, మాజీ సర్పంచి బాలాజీ నాయుడు, రంగయ్యశెట్టి, జలగం రాజ్‌కుమార్, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగునీరు



అయ్యాకన్నువీధిలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

పలమనేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని అయ్యాకన్ను వీధిలోని బొరుగుల బట్టీ క్రాస్ వద్ద మురుగునీరు ఇళ్లల్లోకి వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీధిలో మురుగునీరు వెళ్లే కాలువల్లోనే తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులు అడ్డుగా వేశారని, దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీరు కాలువల్లో వెళ్లలేక పొంగి రోడ్లపై పారడంతో పాటు తమ ఇళ్లల్లోకి వస్తున్నాయని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీటి కాలువల్లో వేసిన పెద్దపెద్ద పైపులను వెలికి తీసి మురుగునీరు కాలువల్లో వెళ్లేలా కాలువల ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా



కల్లూరులో స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేస్తున్న అధికారులు

కల్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ మైనారిటీ అధ్యక్షులు నూర్‌బాషా, బీజేపీ సీనియర్ నాయకులు పార్థసారధి తెలిపారు. కల్లూరు పంచాయతీలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వామిత్వ పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

చౌడేపల్లె, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ పనులు వేగవంతం చేయాలని పలమనేరు ఆర్డీవో భవాని పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిత్వ కార్యక్రమంలో సాంకేతికతో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూముల తదితర వాటి ఖచ్చితమైన హద్దులు గుర్తించడం, ప్రభుత్వ భూములు గుర్తించి హద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ రెవెన్యూ శాఖలు ఉమ్మడిగా సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పనులు నత్తనడకన సాగుతున్నాయని.. వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో లీలామాధవి తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' బహిరంగ సభను విజయవంతం చేయాలి



వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

చౌడేపల్లె, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3న స్త్రీ శక్తి పథకంపై బోయకొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీడీవో లీలామాధవి కోరారు. మంగళవారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చౌడేపల్లె, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల ఏపీఎంలు సుబ్రహ్మణ్యం, హరినాథ్, శివకుమార్, చంద్రమోహన్, హరి, సీసీలు సుగుణ, నాగరత్నమ్మ, రమేష్, శ్రీనివాసులు, గంగోజీ, మునిరత్న, పాండు తదితరులు పాల్గొన్నారు.

సోమలలో విజృంభిస్తున్న జ్వరాలు

సోమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమలలో గత నాలుగు రోజులుగా ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నీటి కాల్వల్లో శుభ్రత లేకపోవడంతో ఇంటింటా జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అధికారులు స్పందించి సోమలలో ఫాగింగ్ పనులు చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మూలపడ్డ ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా: చల్లా



రొంపిచెర్లలో సమస్యలు తెలుసుకుంటున్న చల్లా

రొంపిచెర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కారంలో తాను ఎప్పుడూ ముందుంటానని పుంగనూరు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రొంపిచెర్లలోని ఆయన నివాసానికి వచ్చిన పుంగనూరు, చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు వచ్చి వివిధ సమస్యలు విన్నవించారు. చిన్న చిన్న సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ పాల్గొన్నారు.


అందుబాటులోకి తాగునీటి బోర్లు



సవ్వావాండ్లపల్లెలో బోరు పనులు చేపట్టిన అధికారులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటుమల్లెల పంచాయతీ పరిధిలోని సవ్వావాండ్లపల్లె గ్రామంలో ఐదేళ్లగా పూర్తికాని తాగునీటి పథకాలను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి చొరవతో పరిష్కారమైంది. తెలిపారు. మంగళవారం బి. చల్లావారిపల్లె హరిజనవాడ, కొమ్మేవాండ్లపల్లె, వంకిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో జడ్పీ నిధులతో ఒక్కొక్క బోరుకు రూ.4.5 లక్షల వ్యయంతో బోరు, మోటారు, పైపులైను వేసి తాగునీటి సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో ఏఈ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



మున్సిపల్ స్థలాలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

పుంగనూరు, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక మినీ బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న రాయలచెరువు వంక పొరంబోకు స్థలం ఆక్రమణలు, మున్సిపల్ స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలను గుర్తించి కంచె వేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈస్థలంలో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా దుకాణ సముదాయం నిర్మించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ ఫణి కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, ఏఈ రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం పెంచుకోవాలని ఆర్టీసీ ఉపాధ్యక్షులు పీఎస్.మునిరత్నం అన్నదాతకు పిలుపునిచ్చారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (పూలు, కూరగాయలు)లో మంగళవారం ఉద్యాన, కొబ్బరి అభివృద్ధి బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకుని కొబ్బరి సాగు, మెళకువలు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ సంప్రదాయ పంటలు మంచివే గాని.. వాటికి అధిక నీరు అవసరమవుతాయని, దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. కొబ్బరి వంటి విలువ ఆధారిత ఉత్పత్తులవైపు రైతులు మళ్లాలన్నారు. అందుబాటులోకి వచ్చిన వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అనువర్తించుకుని లాభాలు గడించాలని సూచించారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాగోతం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శరత్‌లు మాట్లాడుతూ కొబ్బరి సాగులోని మెళకువలు, తమ బోర్డు నుంచి అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఉద్యానశాఖ కుప్పం అసిస్టెంట్ డైరెక్టర్ టీఏ.పల్లవి మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన వీడ్ మ్యాట్‌పై తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కొబ్బరి ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.మునిరాజు, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఉద్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు పుస్తకాల వితరణ



ప్రత్యేక ప్రతిభావంతులకు పుస్తకాలు అందజేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులకు మంగళవారం పుంగనూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, తినుబండారాలు అందజేశారు. స్థానిక భవిత కేంద్రంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు వాసవీక్లబ్ ప్రతినిధులు సురేష్, రామకుమార్, కృష్ణమూర్తి, రాజేంద్ర కలిసి ఆహార పదార్థాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి మానసిక స్థైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉద్యోగులు వెంకటరమణ, బిందు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వినాయకుడి నిమజ్జనం



రామకుప్పంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

రామకుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం మంగళవారంతో ముగిసింది. స్థానిక శివాజీనగర్‌కాలనీలో ఏడు రోజుల పాటు పూజలందుకున్నవినాయకస్వామి విగ్రహాన్ని నిర్వాహకులు పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులిచ్చారు. ఊరేగింపు అనంతరం అత్తికుప్పం చెరువులో గణనాథుడికి పూజలు చేసి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన యువకులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కల్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నుంచి తిరుపతికి వెళ్లే భీమవరం రోడ్డులో మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మామిడితోట సమీపంలో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా.. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలంలోని ఎల్లంకివారిపల్లి ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్, దిగుమూర్తివారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు జయచంద్రనాయుడు మంగళవారం ఉదయం సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి తిరుపతికి వెళ్లి పనులు ముగించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. భీమవరం రోడ్డులో వస్తుండగా పుంగనూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆటో ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన జయచంద్ర నాయుడును ప్రైవేటు వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బండ్లపల్లెలో 152 మందికి పింఛన్ల పంపిణీ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బండ్లపల్లె పంచాయతీలో మంగళవారం 152 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులోపడి బండ్లపల్లె పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు రూ.6.34 లక్షల ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్మును స్వాహా చేసిన విషయం తెలిసిందే. చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ మాదంవారిపల్లెకు చెందిన కార్యదర్శి శ్రీనివాసులు తండ్రి వెంకటరెడ్డి రూ.6.34 లక్షలు చెల్లించడంతో సచివాలయ సిబ్బందితో పంచాయతీలోని 152 మందికి అందజేసినట్లు వివరించారు. శ్రీనివాసులు పింఛను సొమ్ము కాజేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

వైఎస్ఆర్‌కు నివాళులు




పలమనేరులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ , పుంగనూరులో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

పలమనేరు, పుంగనూరు, కుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పుంగనూరు బస్టాండు వద్ద చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదుం, రామకుప్పం, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, సోమల మండలాల్లో వైఎస్ వర్ధంతిని జరుపుకున్నారు.

నేడు పుంగనూరు మండల సమావేశం

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పుంగనూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆక్రమిత స్థలం పరిశీలన

పెద్దపంజాణి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణలకు గురికావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దారు హనుమంతు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. అలాగే పాఠశాల స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పాఠశాలకే కేటాయిస్తామని పేర్కొన్నారు. మండల సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వో సుజాత, ప్రధానోపాధ్యాయులు కేశవపిళ్లై, పాఠశాల కమిటీ ఛైర్మన్ వరప్రసాద్, నాయకులు చెంగారెడ్డి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వి.కోట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట-పలమనేరు రహదారిలో ఖాజీపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు చేపట్టే సుమన్ తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం ఉదయం కాలువ పనులను పరిశీలించి కారులో వి.కోటకు వస్తుండగా.. ఉదయం 5 గంటల ప్రాంతంలో తమిళనాడు నుంచి పలమనేరు వైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో సుమన్ తీవ్రంగా గాయపడటంతో పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. సీఐ సోమశేఖర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రామకుప్పం మండల సమావేశం

రామకుప్పం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం రామకుప్పం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి పూజిత

రామకుప్పం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆదేశించారు. ఆశా డేని పురస్కరించుకొని మంగళవారం ఆస్పత్రిలో ఆశా కార్యకర్తల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించడం, పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. సమావేశం అనంతరం రెడ్డివారిపల్లెలో డెంగీ జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామంలో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌పీ బాలు, హెచ్‌ఈ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ రాము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గ్రామస్తుల ఔదార్యం..!

అక్కదేవతల ఆలయ అభివృద్ధి పనులు

- ఈనెల 5న ఉత్సవాలు ప్రారంభం

సోమల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లె సమీపంలోని అక్కదేవతల ఆలయంలో ఈనెల 5, 6వ తేదీల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఆలయం వద్ద అభివృద్ధి పనులకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఆలయం వద్దకు వెళ్లే మార్గంలో రూ.4 లక్షల వ్యయంతో స్వాగత ఆర్చి, ఆలయం వద్ద పలు ఉప ఆలయాలతో పాటు రూ.4 లక్షలతో అన్నదాన షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గట్టువారిపల్లెలోని పలువురు దాతలు సొంత నిధులు కేటాయించడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 5న ఆలయం వద్ద గణపతిపూజ, కలశాభిషేకం, ముఖద్వార కలశ ప్రతిష్ఠ, ఉపవాసదీక్షలతో పూజాసామగ్రి ఊరేగింపు, 6న కోర్కెలు తీరిన భక్తులచే వాహనాలతో అక్కదేవతల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లడం, ఉదయం నుంచి నిరంతరం అభిషేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



పుంగనూరులో అన్నదానం చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు



సోమలలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

పుంగనూరు, సోమల, రామకుప్పం, వి.కోట, చౌడేపల్లె, రొంపిచెర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పుంగనూరులో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. సోమల మండలంలోని సోమల, కందూరు, నంజంపేట, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పొదలగుంట్లపల్లె, వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లెలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేక్‌ను కట్ చేసి, ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలల్లో రోగులకు పండ్లు పంచారు. అలాగే బైరెడ్డిపల్లె, రామకుప్పం, వి.కోట, చౌడేపల్లె, రొంపిచెర్ల మండలాల్లో డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. దీనికి ముందుగా ఎమ్మెల్యే జగన్మోహన్ అధ్యక్షతన గాంధీ విగ్రహ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశాక కూటమి పార్టీల శ్రేణులు, రైతులతో కలిసి ర్యాలీగా మార్కెట్ యార్డుకు చేరుకోనున్నారు.

రేపు టౌన్ బ్యాంకు పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఫైవ్‌మెన్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం గురువారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో జరగనుంది. ఈమేరకు బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో సుమతి తెలిపారు. చైర్మన్‌గా కాంద్ర రమేష్ నాయుడు, సభ్యులుగా డి.బాబురెడ్డి, టి.సురేష్ బాబు,జి.నరసింహులు, ఎ.అన్సర్‌లను ప్రభుత్వం ఇటీవల నియమించిన విషయం తెలిసిందే.

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



పుల్లూరు క్రాస్ రోడ్డులో క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న హనుమంతరావు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురంలోని పుల్లూరు క్రాస్ రోడ్డులో ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లను మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమంతరావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు, పీఎంపీలు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేశామని చెప్పారు.

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోనూ గిరిరాజ్, మునిరాజు, జానకిరామరెడ్డిల క్లినిక్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌వో కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ కదిరివన్, మహిళా పోలీస్ రత్న, ఆశవర్కర్ జ్యోతి పాల్గొన్నారు.



కాణిపాక వరసిద్దుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఉభయదారులు, ఈవో పెంచలకిషోర్ - ఆస్థాన మండపంలో కళాకారుల నృత్యాభినయం - రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం

వరసిద్ధుడి సేవలో బీసీ వెల్ఫేర్ కార్యదర్శి

ఐరాల(కాణిపాకం)/తవణంపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి,వాసు, బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. అలాగే తవణంపల్లె మండలంలోని అర్ధగిరి వీరాంజనేయస్వామిని కూడా సత్యనారాయణ దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.



సత్యనారాయణకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కార్వేటినగరం, వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం, ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.



పచ్చికాపల్లంలో కేక్ కట్ చేస్తున్న యుగంధర్

భక్తులకు అన్నదానం



గుడిపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా తమిళనాడులోని వళ్లిమలై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద జనసేన నాయకురాలు సింధూ రాయల్ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరంగుడిపాలలో జనసేన మండల అధ్యక్షుడు రూప్ కుమార్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి, అన్నదానం చేశారు. జిల్లా నాయకురాలు ఆరణి కవిత, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హైరోడ్డు విస్తరణ పనుల పరిశీలన

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో జరుగుతున్న హైరోడ్డు విస్తరణ పనులను మంగళవారం మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించారు. తిరుపతి రోడ్డులోని కట్టమంచి సుజుకి షోరూం ఉన్న ప్రైవేటు బిల్డింగ్ యజమానిని ఒప్పించి విస్తరణకు అవసరమైనస్థలాన్ని సేకరించారు. ఏసీపీ నాగేంద్ర, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 15మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రెండ్రోజులుగా నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. 15 మంది మద్యం తాగి వాహనాలను నడపటంతో కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

సీహెచ్‌సీ సందర్శన

వెదురుకుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ని ఎంపీపీ లత మంగళవారం సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

వైఎస్‌కి నివాళి

వెదురుకుప్పం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్థంతి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల నివాళి అర్పించారు. జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కృపాలక్ష్మి.. కార్వేటినగరం, శ్రీరంగరాజపురం మండలం 49.కొత్తపల్లెమిట్ట, పెనుమూరు, గంగాధరనెల్లూరుల్లోని వైఎస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ లత, వైసీపీ జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, శ్యామ్‌రాజ్, విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.



నేత్రదానం చేయండి

చిత్తూరు రూరల్ సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి.. ఇద్దరికి చూపును ప్రసాదించండి అని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంవో సంధ్య కోరారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేడియాలజిస్ట్ చంద్రమ్మ, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర

పాలసముద్రం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకావేరిరాజుపురంలో గంగజాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. రాత్రికి వీధి నాటకాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించి గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలివ్వండి:సీపీఐ

నగరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లోని 18 నెలల జీతాలను చెల్లించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఎంపీడీవో కృష్ణయ్యకు మంగళవారం వినతి పత్రం అందించారు.